సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 5 । జనవరి । 2023



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, దీనిని అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. -8లో



శ్మశానాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నేతలు

టీడీపీ నేతలు శ్మశానాన్ని జేసీబీలతో ధ్వంసం చేసిన సంఘటనటి గుర్రంకొండ మండలంలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.120
రెండోరకం	రూ.56	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 168 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	590	665
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 173 కిలోలు

రాయచోటి అభివృద్ధిపై సమీక్ష

రాయచోటి: రాయచోటి అభివృద్ధికి చేపట్టిన వివిధ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రాయచోటి పట్టణం, రూరల్ ప్రాంతాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆర్‌అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, స్టెప్, పర్యాటకం, ఎండోమెంట్, హౌసింగ్, ఫారెస్టు తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల ప్రతిపాదిత పనులకు రెండు రోజుల్లోగా సమగ్రమైన ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. ఈ సమీక్షలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, జిల్లా ఇరిగేషన్ అధికారి కృష్ణమూర్తి, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, ఆర్‌అండ్‌బి డీఈ సురేష్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థతో ఆర్థిక పరిపుష్టి

రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఆర్థిక పరిపుష్టి జరుగుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభిప్రాయపడ్డారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పైలెట్ కో-ఆర్డినేటర్ కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఐఎల్ఐపీ ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆదాయాన్ని పెంపొందించే విధంగా చేపట్టిన వివిధ పైలెట్ ప్రాజెక్టుల గురించి చర్చించారు. రైతుల సమగ్ర అభివృద్ధికి ఎఫ్‌పీఓలు కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌ని పెంపొందించి రాష్ట్రంలోనే మన జిల్లా ఒక రోల్ మోడల్‌లాగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా హార్టికల్చర్ అధికారి రవిచంద్ర పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కురబలకోట: జగనన్న కాలనీ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కడప క్రాస్ దగ్గరున్న జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే వేటు తప్పదన్నారు. ఈ నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి, తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా మంజూరైన పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే నవాజ్‌బాషా



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పేదల జీవితాలకు భరోసా పింఛన్
- జిల్లాలో కొత్తగా 7,020 మందికి పెన్షన్లు మంజూరు
- మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- పెన్షన్ కానుక వారోత్సవాల్లో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. రాష్ట్రప్రభుత్వం పెన్షన్ కానుక రూపంలో అందిస్తున్న నగదు ఎందరో పేదల జీవితాలకు భరోసాగా నిలుస్తుందని తెలిపారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన స్థానిక ఎస్‌వీఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో మొదట పెన్షన్ లబ్ధిదారులకు సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ప్రతినెలా 1,84,000 పింఛన్లు వస్తుంటే నూతన ఏడాది నుంచి కొత్తగా మరో 7,020 వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు అదనంగా మంజూరయ్యాయన్నారు. రూ.2,500 ఇస్తున్న పెన్షన్‌ను ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుంచి 2,750కు పెంచుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ నిలబెట్టుకోవడంపై పెన్షన్‌దారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. జిల్లాలో ప్రతినెలా సుమారుగా రూ.62 కోట్లు పెన్షన్ రూపంలో పంపిణీ జరుగుతోందన్నారు. కేవలం పెన్షన్ మాత్రమే కాకుండా ప్రజాసంక్షేమంలో భాగంగా 50 నుంచి 60 పథకాలు ప్రతి ఇంటి గడపకు చేరుతున్నాయన్నారు.

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు అర్హులందరికీ దశలవారీగా పెన్షన్ పెంచుకుంటూ పోతానని ఇచ్చిన మాటను నిలుపుకున్నారన్నారు. దేశంలో రూ.2,750 నుంచి రూ.10,000 వరకు పింఛను మొత్తం పంపిణీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం ఇంత మంచి చేస్తుంటే పేదల గురించి ఏరోజూ ఆలోచించని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా పెన్షన్‌లు నిలిపేస్తున్నారని విమర్శలు చేస్తున్నారన్నారు. అనంతరం పెన్షన్ కానుక పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, ఎమ్మెల్యే కొత్తగా పెన్షన్‌లు మంజూరైన లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకా వెంకటాచలపతి, నూర్ ఆజం, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీలు నందిని తాజ్, పసుపులేటిరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, వార్డు కౌన్సిలర్లు, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

మార్చిలోపు టిడ్కో ఇళ్లు పూర్తిచేయాలి

టిడ్కో ఇళ్లలో యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి, మార్చి చివరిలోపు నిర్మాణాలు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం మదనపల్లె-తిరుపతి మార్గంలోని వెంకప్పకోట వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహనిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణాల్లో ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంత పేదప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు నిర్దేశించిన టిడ్కో పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలో ఇళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీ, ఏపీ టిడ్కో డిప్యూటీ ఈఈ బలరామయ్య, ఏఈ షాహిర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో కేంద్ర బృందం తనిఖీ



జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న నాక్ కమిటీ సభ్యులు

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. కేంద్రం నుంచి డాక్టర్.సెంథిల్ కుమార్, అబ్దుల్‌రెహమాన్, అమిత, రాష్ట్రం తరపున డాక్టర్.జ్యోతిరెడ్డి, జిల్లా నుంచి డాక్టర్.ప్రభావతి మొత్తం 5మందితో కూడిన బృందం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. మూడు రోజుల పాటు తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెంచడంలో భాగంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఆర్ఎంఓ దివాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ విశిష్ట వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ విశిష్ట వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా పరిశ్రమల మేనేజర్ నాగరాజు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాయచోటి డైట్‌కళాశాలలో వ్యక్తిత్వవికాసం,కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి వ్యక్తిత్వం విలువైన ఆభరణం లాంటిదన్నారు. స్టెప్ సీఈఓ సారాగ్రేస్ మాట్లాడుతూ వ్యక్తిత్వంతోనే మనిషి మహనీయుడు అవుతారన్నారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిత్వానికి రూపసౌందర్యం అక్కరలేదన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంపై అవగాహన యువతకు దోహదపడతాయని చెప్పారు. అనంతరం కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకప్రతులను విడుదలచేసి విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు శ్రీదేవి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.


కెరీర్ గైడెన్స్ పుస్తక ప్రతులను విడుదల చేస్తున్న స్టెప్ అధికారులు,డైట్ అధ్యాపకులు

శ్మశానాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నేతలు

గుర్రంకొండ : టీడీపీ నేతలు శ్మశానాన్ని జేసీబీలతో ధ్వంసం చేసి సమాధులపై మట్టిపోసి పూడ్చివేసిన సంఘటన మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో జరిగింది. దీంతో నాలుగు దశాబ్దాలుగా అక్కడ ఉన్న సమాధాలు మట్టిపాలయ్యాయి. మండలంలోని టి.పసలవాండ్లపల్లె, చాగల పల్లె గ్రామాలకు చెందిన ప్రజలు నాలుగు దశాబ్దాలుగా ఆయా గ్రామాల్లో మృతి చెందిన వారిని సమీప పొలాల వద్ద పూడ్చేవారు. కేశాపురం- కలిచెర్ల మార్గంలో ఆయా గ్రామాలకు పక్కనే ఈ శ్మశానం ఉంది. సమాధులకు స్థలం లేని అన్ని కులాలకు చెందిన వారు వారి పూర్వీకులను ఇక్కడే పూడ్చి సమాధులు నిర్మించుకున్నారు. అయితే రెండురోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్మశానం ఉన్న స్థలం తమ పూర్వీకులదేనని పేర్కొంటూ జేసీబీతో చదును చేశారు. అక్కడ ఉన్న సమాధులపై మట్టి పోసేసి చదును చేశారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. 40 సంవత్సరాలు ఇక్కడ సమాధులు వేసుకొంటున్నా ఎన్నడూ లేని అభ్యంతం ఈరోజు ఎందుకు వచ్చిందంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈసంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ ఖజాబీని వివరణ కోరగా గతంలో ఎంత మేరకు విస్తీర్ణంలో శ్మశానం ఉంది.. ఎన్ని సమాధులు పూడ్చివేశారో పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. మొత్తం సర్వేచేసి సరిహద్దులు నాటించి చర్యలు చేపడతామన్నారు.


శ్మశాన స్థలాన్ని చదును చేసిన దృశ్యం


మట్టిపోసి సమాధులను పూడ్చివేసిన దృశ్యం

జూదస్థావరాలపై పోలీసుల దాడులు

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీసులు 4 జూద స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీ ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో పేకాట ఆడుతున్న 8మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.41,500 నగదు, అలాగే ఈశ్వరమ్మకాలనీ వినాయకటెంపుల్ సమీపంలో మరో ఆరుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.18,575 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోటవారిపల్లె తండా నరసింహస్వామి ఆలయం సమీపంలో మరో నలుగురిని అరెస్ట్‌చేసి రూ.9,110, వలసపల్లె పంచాయతీ జవహర్ నవోదయ విద్యాలయ సమీపంలో మరో నలుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.8,320 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రశేఖర్, సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వెలుగు సీసీకి తీవ్రగాయాలు

రామసముద్రం/మదనపల్లె : రామసముద్రం మండలంలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో చెంబకూరు క్లస్టర్ వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్(సీసీ) కోలార్‌కృష్ణప్ప తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో కృష్ణప్పతో పాటు అతడి మామ బి.కృష్ణప్ప సైతం గాయపడ్డారు. మండలంలోని స్వగ్రామం ఊలపాడు నుంచి మామ కృష్ణప్పతో కలిసి వెలుగు సీసీ కోలార్‌కృష్ణప్ప ద్విచక్రవాహనంలో రామసముద్రం బయలుదేరాడు. దిగువపేట వద్ద కుక్క, కోతి అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి వారు కిందపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.తీవ్రంగా గాయపడిని వెలుగు సీసీ కృష్ణప్పను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మామ బి.కృష్ణప్ప జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీఎం సుబ్రహ్మణ్యం, సురేష్‌రెడ్డిలు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పరామర్శించారు.


గాయపడిన కృష్ణప్ప

వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల : వైఎస్సార్‌జిల్లా పులివెందుల పట్టణంలోని ఎస్ఎస్ఆర్ లాడ్జిలో గంగిరెడ్డి(65) అనే వ్యక్తి బుధవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం నియోజకవర్గం వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి కొంతకాలంగా పులివెందుల పట్టణంలోని ఎస్ఎస్ఆర్ లాడ్జిలో వాచ్‌మెన్ పనిచేస్తుండేవారు.మంగళవారం రాత్రి మద్యం తాగి లాడ్జిలో ఉన్న కిటికీ కడ్డీకి ఉరి వేసుకున్నాడు. అర్బన్ సీఐ రాజు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.గంగిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీపీపీలో నిరసన

ఎర్రగుంట్ల(వైఎస్సార్‌జిల్లా) : మహారాష్ట్రలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నవారికి మద్దతుగా బుధవారం ఆర్టీపీపీలోని పవర్ హౌస్ గేటు వద్ద జాతీయ జేఏసీ పిలుపు మేరకు ఆర్టీపీపీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ముగిసిన డాక్టర్ వైఎస్సార్ అడ్వెంచర్ ఫెస్టివల్

వేంపల్లె : గతనెల 29వ తేదీనుంచి జనవరి 3వ తేదీవరకు నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ అడ్వెంచర్ ఫెస్టివల్ ముగిసినట్లు ఏపీ అడ్వెంచర్ క్లబ్ వ్యవస్థాపకులు కె.రంగారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ చుట్టుపక్కల ప్రాంతాల్లో సహజసిద్ధమైన పింక్ కొండలు ఉన్నాయని, ఇవి ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, ర్యాపిలింగ్‌కు అనువుగా ఉన్నాయన్నారు. పాపాఘ్ని నది జల క్రీడలకు అనుకూల ప్రదేశంగా ఆయన వర్ణించారు. అడ్వెంచర్ క్లబ్ ఆఫ్ ఏపీ, పాడా, నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో గుంటూరు యూత్ హాస్టల్ అసోసియేషన్ ప్రొఫెసర్ కొండయ్య ఆధ్వర్యంలో దాదాపు 15మంది విద్యార్థులు ఈ అడ్వెంచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారని చెప్పారు. 180అడుగుల కొండపై నుంచి రాపిలింగ్ నిర్వహించామన్నారు. తమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, గండి దేవస్థానం ఈఓ ముకుందారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కావలి కృష్ణతేజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న 15 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అడ్వెంచర్ అవార్డు గ్రహీత డేవిడ్ క్రిష్టఫర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆర్.శ్రీధర్‌రాజు, ఆర్పీ అరీఫ్, శిక్షకులు సుధీర్ సింగ్, కౌసిక్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల రాక్ క్లైంబింగ్

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

చక్రాయపేట (వైఎస్సార్ జిల్లా): గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి అనంతపురం జిల్లా వాసి రు.1,00,116లు విరాళంగా అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మినేని చిన్నప్ప తన తల్లి దండ్రులు ముత్యాలమ్మ, కంబన్నల జ్ఞాపకార్థం నగదును అందజేశారని చెప్పారు.ఈసందర్భంగా వారిచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రవిచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేయడం దారుణం

ప్రజా విశ్వాసం లేని చంద్రబాబు నైతిక బాధ్యతగా రాజకీయాల నుంచి వైదొలగాలి
: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి తన పబ్లిసిటీ కోసం 40 మంది హత్యకు కారకుడైన మాజీ సీఎం చంద్రబాబునాయుడు నైతిక బాధ్యతగా రాజకీయాల నుంచి వైదొలగడమే మంచిదని వైఎస్ఆర్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుప్పం పర్యటనలో పోలీసులపై జరిగిన దాడి సంఘటనను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రశాంతత కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులపై మాజీ సీఎం చంద్రబాబు దాడులు చేయించడంపై శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన సంఘటనలు, ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు చట్టాలను తీసుకొస్తాయన్నారు. వాటిని గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలోనే సీనియర్ రాజకీయ నేతగా చెప్పుకునే మాజీ సీఎం చంద్రబాబు చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులపై దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లపైన మీటింగ్‌లు పెట్టవద్దని జీఓ ఇస్తే, ఆ జీఓలను అగౌరవపరిచేలా మాట్లాడడం బాబుకు తగదన్నారు. ఇలా ఏదో ఒక అంశంపై అలజడి సృష్టించే ప్రయత్నానికి చంద్రబాబు కుట్రలు చేస్తుంటారని విమర్శించారు. బాబు చేస్తున్న దుశ్చర్యలకు ఎల్లో మీడియా కూడా తోడైందన్నారు. వారం రోజుల వ్యవధిలోనే పబ్లిసిటీ కోసం 11 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. నిజంగా చెప్పాలంటే బాబు పబ్లిసిటీ కోసం 11 మంది హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘోర సంఘటన జరిగినా చంద్రబాబునాయుడులో ఏమాత్రం బాధ, సానుభూతి లేకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఓపెన్ ప్రదేశాలు, పెద్ద మైదానాల్లో సభలు, సమావేశాలు ఇతర రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చన్నారు. ఓపెన్ ప్రదేశాల్లో టీడీపీ కార్యక్రమాలు చేపడితే ప్రజలు రారన్న దురుద్దేశంతో, భయంతో ఇలా రోడ్లపైనే రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహించి రెచ్చిపోవడం చట్టాన్ని ఉల్లంఘించడం కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తన పబ్లిసిటీ కోసం 11 మంది హత్యకు కారకుడైన ఆ పాపాన్ని మాత్రం పోలీసులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. పోలీసులను విమర్శించే బాబు వారి రక్షణ లేకుండా ఒక గంట బయట తిరగగలుగుతాడా అని నిలదీశారు. దురదృష్టకర సంఘటనలకు ప్రేరేపించే ప్రతిపక్ష నాయకుడు ఈ రాష్ట్రంలోనే ఉండటం ఈ రాష్ట్ర ప్రజలు చేసుకున్న కర్మగా ఆయన అభివర్ణించారు. ప్రజలకు మంచి జరగాలని మంచి నిర్ణయాలు తీసుకోవడాన్ని రాజకీయం చేయడం, అడ్డగోలుగా వ్యవహరించడం బాబుకే చెల్లిందన్నారు. పబ్లిసిటీ పిచ్చి వలన గోదావరి పుష్కరాలలో 29 మంది, ఈ మధ్యకాలంలో 11 మంది మొత్తం 40 మందిని హత్య చేసిన ఘనత బాబుకు దక్కుతుందన్నారు. హత్య చేసిన ఈ పాపాలు బాబును జీవితాంతం వెంటాడుతాయన్నారు.

పోలీసుల అదుపులో యువకులు

మదనపల్లె : నడిరోడ్డుపై వీరంగం సృష్టిస్తూ యువకుడిపై దాడిచేసి గాయపరిచిన ఘటనలో నిమ్మనపల్లెకు చెందిన ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. యువతి విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో ఒక వర్గానికి చెందిన యువకులు మరో వర్గంలోని ఇద్దరిపై దాడి చేశారన్నారు. వీటిని స్థానికంగా కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారన్నారు. దీంతో దాడికి పాల్పడ్డ యువకులను గుర్తించి ఇరువర్గాలకు చెందిన వారందరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు నిమ్మనపల్లె మండలానికి చెందిన వారని, పట్టణంలో బేల్దారి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. చెల్లెలిని వేధింపులకు గురిచేసినందుకు అన్నలు తమ స్నేహితులతో కలిసి ఓ యువకుడిని మందలించడంతో అతడు తమ స్నేహితులతో కలిసి యువతి అన్నలపై దాడిచేశారన్నారు. దీనికి సంబంధించి ఇరుపక్షాలకు చెందిన యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. రోడ్డుపై ఘర్షణకు దిగుతూ, రౌడీయిజం ప్రదర్శించడంపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని ప్రతి కళాశాల వద్ద పోలీసునిఘాను మరింతగా పెంచి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.


దాడికి పాల్పడిన యువకులను విచారిస్తున్న సీఐ మురళీకృష్ణ

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వల్ల జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలు పట్టణం పల్లె సమీపాలలోని పొదలు, రహస్య ప్రదేశాల చాటున అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం వంటి చర్యలు నేరమన్నారు. జిల్లాలో 262 ప్రదేశాలను నేరాలు జరిగేవిగా గుర్తించామన్నారు. అలా గుర్తించిన ప్రదేశాలను ఆయా ప్రాంతాల పరిధిలోని పోలీస్ అధికారులు, పంచాయతీ, మునిసిపల్ సిబ్బందితో వెళ్లి చెత్తాచెదారం, చెట్లను తొలగించి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. వీటితో పాటు ప్రతిరోజూ గుర్తించిన ప్రదేశాల్లో గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు గానీ సమాచారం అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.


సూచికబోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

అంధ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే ధ్యేయం

కడప ఎడ్యుకేషన్ : అంధ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడమే ధ్యేయమని ఏపీ రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీమా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమా రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఫ్రాన్స్ దేశంలోని కుప్రే అనే మారుమూల గ్రామంలో జన్మించారన్నారు.అంధుల కోసం ఆరు చుక్కలతో లిపిని రూపొందించారన్నారు. నేటి సమాజంలో ఎంతోమంది అంధ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి వారి భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. రానున్న కాలంలో వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల పరికరాలు, వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన పుస్తకాలు, ట్యాబ్‌లను, స్కాలర్‌షిప్‌లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు, ప్రమోషన్లలో నాలుగుశాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా చూస్తామన్నారు. జిల్లా వికలాంగులు, వయో వృద్ధులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, అంధుల కోసం ప్రత్యేక అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకుని రానున్న కాలంలో విభిన్న ప్రతిభావంతులు మంచిస్థాయికి ఎదగాలని అన్నారు. నగర పాలక డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీకాంత్, దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్యయాదవ్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీమా రవిప్రకాష్‌రెడ్డి